క్లుప్తంగా

ఏపీఎస్పీసీఎల్‌కు భూ కేటాయింపుపై ప్రతిపాదనలు పంపండి

నంద్యాల: ఆంధ్రప్రదేశ్ సోలార్ పవర్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజ్ ప్రాతిపదికన భూముల కేటాయింపుకు సంబంధించిన ప్రతిపాదనలను ఆలస్యం చేయకుండా వెంటనే పంపించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా అధికారులకు సూచించారు. బుధవారం విజయవాడలోని సీసీఎల్ఏ కార్యాలయం నుంచి సీసీఎల్ఏ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో భూ కేటాయింపుపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డీఆర్ఓ రామునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ భూమి కేటాయింపులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆక్రమణలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

పేదరిక నిర్మూలనకు చర్యలు

ఉయ్యాలవాడ : ప్రభుత్వం పేదరికం నిర్మూలనకు చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా పీ–4 సర్వే చేసిందని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం రెండో రోజు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు పీ–4 సర్వే ద్వారా 20 గ్రామ పంచాయతీల్లో 1,016 బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందన్నారు. ఈ కుటుంబాలను 118 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారన్నారు. జోనల్ ట్రైనర్ విజయభాస్కర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల జీవనోపాధి మెరుగు పరిచేందుకు చేపట్టవలసిన విధి విధానాలపై ఉద్యోగులకు శిక్షణ ద్వారా తగు సూచనలు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి



మాయలూరులో రైతులకు సలహాలు ఇస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ: ఖరీఫ్ సీజన్ మరో వారం రోజుల్లో ముగుస్తుంది. త్వరలో రబీ సీజన్ ప్రారంభం కానుంది. రబీలో వేసే పంటలకు రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని రూపనగుడి, మాయలూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీలో ఎక్కువ శాతం రైతులు పప్పుశనగ సాగు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారన్నారు. మండలానికి 3,600 క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలు కావాలని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. పప్పుశనగ సాగు చేసే రైతులు ట్రైకోడెర్మవిరిడి, క్లోరోఫారిపాస్ ద్రావణాన్ని మిశ్రమం చేసి వాడితే ఎండు తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు సహకరించండి



సమావేశంలో మాట్లాడుతున్న రామునాయక్

నంద్యాల: పారదర్శక ఓటర్ల జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రామునాయక్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ తనచాంబర్‌లో ఓటర్ల జాబితా రూపకల్పనపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో చనిపోయిన ఓటర్లు, మార్పులు, చేర్పులు, బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పోలింగ్ బూతులలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు, కలెక్టరేట్ ఏఓ శుభాకర్, ఎన్నికల విభాగపు డిప్యూటీ తహసీల్దార్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టిమిద్దె.. తప్పిన పెను ప్రమాదం



మట్టిమిద్దె కూలిన దృశ్యం

ఆళ్లగడ్డ : గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని యాదవాడ గ్రామానికి చెందిన మంగళి శేఖర్ అనే వ్యక్తి మట్టి మిద్దె కూలిపోయింది. ఇంట్లో సభ్యులెవ్వరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. శేఖర్ కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా మంగళవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగింది. భార్యభర్తలు నిద్రించే గదికి పక్కనే ఉన్న గదిలో దూలాలతో సహా మట్టి మిద్దె కుప్ప కూలింది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.



శిరివెళ్ల మండలం యర్రగుంట్లలో అన్న పూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



రుద్రవరంలో సంతానలక్ష్మి అలంకారంలో అమ్మవారు



శ్రీ అన్నపూర్ణ అలంకారంలో శ్రీ కాళికాంబా దేవి



ఉయ్యాలవాడ మండలం ఇంజేడులో అన్నపూర్ణాదేవిగ భక్తులకు దర్శనమిస్తున్న చౌడేశ్వరి దేవి

జగన్మాతా..పాహిమాం



శ్రీ జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు



దొర్నిపాడులో అమ్మవారిని పూజిస్తున్న భక్తులు, ఉభయదారులు



ముత్యాలపాడులో శ్రీభవానిదేవి అలంకార పూజలో పాల్గొన్న ఉభయదారులు

నంద్యాల (వ్యవసాయం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం నంద్యాల, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. ఉదయాన్నే అభిషేకలు, సామూహిక కుంకుమార్చనలు, హోమాలు, లలితా సహస్రనామ పారాయణం, వేద పారాయణ తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో వెలసిన అమ్మవారిని శ్రీమణిక్యాంబాదేవిగా, వాసవి కనకా పరమేశ్వరాలయంలో మహాలక్ష్మి దేవిగా, సంజీవనగర్ రామాలయంలో చంద్రలంకా అలంకారంలో కాశీవిశాలక్ష్మి అమ్మవారు, శ్రీ బ్రహ్మానందీశ్వర స్వామి ఆలయంలో గిరిజాదేవి అలంకారంలో గంగాదేవి, చంద్రగంట అలంకారంలో కాశీవిశాలక్ష్మి అమ్మవారు దర్శనమిచ్చారు. మద్దిలేటి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నపూర్ణ దేవిగా అలంకరించారు. గాయత్రి దేవాలయంలో, కోటా సుంకులమ్మ ఆలయంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. గోస్పాడు, చాగలమర్రి, శిరివెళ్ల, దొర్నిపాడు, ఉయ్యాలవాడ, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు కనులపండువగా సాగాయి.

వైభవోపేతం.. నవరాత్రి ఉత్సవం!



ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు, గోదాదేవి అమ్మవారు

ఆళ్లగడ్డ: అహోబిల నవనారసింహ క్షేత్రాలు భక్త జనసంద్రంగా మారాయి. నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని బుధవారం తండోపతండాలుగా తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంతో చేసిన గోవిందా నామస్మరణతో నల్లమల పులకించి పోయింది. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను యాగశాలలో కొలువుంచి అభిషేకం, అర్చన, తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను నూతన పట్టుపీతాంబరాలతో అలంకరించి అద్దాల మండపంలో కొలువుంచి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి విశేష పుష్పాలకంరణ గావించిన ఉత్సవ పల్లకీలో ఉభయ దేవేరులతో కొలువైన శ్రీ ప్రహ్లాదవరదుడు మాడ వీధుల్లో సంచరిస్తూ భక్తులకు కనువిందు చేశారు

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం



నంద్యాల వైద్యశాలలో సర్వేయర్‌ను పరామర్శిస్తున్న తహసీల్దారు

ఆళ్లగడ్డ: ఎలాంటి సమస్య ఎదురైనా అధైర్య పడొద్దని తాము అండగా ఉంటామని రుద్రవరం తహసీల్దారు దోని ఆల్ఫ్రెడ్ సర్వేయర్ సరస్వతికి చెప్పారు. రుద్రవరం మండలంలోని పేరూరు గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న సరస్వతి పని ఒత్తిడి,అధికారులు వేధింపులతో మనస్థాపానికి గురై మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఆళ్లగడ్డ వైద్యశాలలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు బుధవారం అక్కడికి వెళ్లి ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన అక్కడి వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట మండల సర్వేయర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

పెండింగ్ డీఏలు విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మౌలాలి

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయాలని, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని ఎస్టీయూ నంద్యాల జిల్లా అధ్యక్షుడు మౌలాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాసంక్షేమంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కూడా ప్రభుత్వాల బాధ్యతేనని చెప్పారు. ఉద్యోగులకు సంబంధించిన ఆర్థిక పర బకాయిలను వెంటనే చెల్లించాలని, లేని పక్షంలో ఉద్యమబాట పడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు సుబ్బయ్య, నరసింహారావు, నాగేశ్వరరెడ్డి, విజయకుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ రద్దు హర్షణీయం

గోస్పాడు: ఎల్ఐసీ బీమా పాలసీలపై జీఎస్టీ రద్దు హర్షణీయమని లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ పొలిటికల్ యాక్షన్ కమిటీ చైర్మెన్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. 2014వ సంవత్సరం జనవరి1 నుంచి పాలసీల మీద జీఎస్టీ విధించడం జరుగుతుందన్నారు.దీనిని నాడు ఏజెంట్ అసోసియేషన్ తీవ్రంగా వ్యతిరేకించిందన్నారు. కేంద్రం ఈనెల 22 నుంచి జీఎస్టీ రద్దు చేయడంతో పాలసీదారులకు మేలు జరుగుతుందన్నారు.తక్కువ ప్రీమియంతో బీమా చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

నివాళి

నంద్యాల(న్యూటౌన్): సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ముక్తర్ బాషా ఆశయ సాధనకు ప్రతి కార్యకర్త ఉద్యమించాలని ఆపార్టీ డివిజన్ కార్యదర్శి శంకర్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ముక్తర్ బాషా ఐదో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చౌడప్ప, రాంబాబు, శ్రీనివాసులు, రాజు తదితరులు పాల్గొన్నరు.

విద్యార్థులకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): సహకార సంఘాలు–యువతకు ప్రయోజనాలు అనే అంశంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ శశికళ అధ్యక్షతన జిల్లా సహకార సంఘం అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సహకార సంఘం అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ యువత, విద్యార్థులు సహకార సంఘాల్లో సభ్యులుగా చేరి వృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. జిల్లా ఉప రిజిస్ట్రార్ రుక్సానా బేగం, కో–ఆర్డినేటర్ పార్వతి, నాగేంద్ర, వెంకటసుబ్బయ్య, రాజశేఖర్, రషీద్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): శ్రీగురు రాజా ఇంగ్లిష్ మీడియం స్కూల్, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ అధ్యాపక బృందానికి రెండు రోజులుగా నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. శ్రీ గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈపోటీల్లో విజేత జట్లకు నంద్యాల క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ మౌలాలి రెడ్డి ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు మనోహర్ రెడ్డి, శివకుమార్ రెడ్డి, సుబ్బారావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండల పరిధిలోని పెద్దకంబలూరుకు చెందిన అబ్దుల్లా (26)అనే వ్యక్తి బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహమ్మద్ రఫీ తెలిపిన వివరాల మేరకు.. వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించే మృతుడు మద్యంకు బానిసయ్యాడు. కొద్ది నెలల క్రితం పెళ్లి కూడా అయ్యింది. ఈ క్రమంలో కుటుంబంలో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో మనస్థాపానికి గురై మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి మహమ్మద్‌బీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రోత్సాహకాలు

పాణ్యం: మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు పీఎంఈజీపీ పథకం ఎంతో ఉపయోగిపడుతందని, దీనిని మహిళలు ఉపయో గించుకోవాలని డ్వామా పీడీ శ్రీధర్‌రెడ్డి అన్నా రు. బుధవారం పాణ్యం పొదుపు కార్యాలయ ంలో మహిళలతో సమావేశం నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే వారికి ప్రోత్సాహకాలు అందిస్తే వ్యాపారవేత్తలుగా రాణిస్తారన్నారు. ఆసక్తి గల మహిళలు ఉత్తమ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు పీఎంఈజీపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసాద్, పరిశ్రమశాఖ జీఎం మహబూబ్‌బాషా, ఐపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.





అధినేత వైఎస్ జగన్‌తో..

ఆళ్లగడ్డ: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆళ్లగడ్డ పార్టీ నేతలు బుధవారం కలిశారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, పార్టీ కర్నూలు పార్లమెంట్ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తదితర నేతలు తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేతతో సమావేశమై నియోజకవర్గానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు.

ఎరువుల పంపిణీ సక్రమంగా చేపట్టండి

- ఈ నెలాఖరులోపు ఖరీఫ్ పంటల నమోదు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: జిల్లాలో ఎరువుల పంపిణీని సక్రమంగా చేపట్టాలని జిల్లాకలెక్టర్ రాజకుమారి అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఆర్డీఓలు, తహసీల్దారులు, వ్యవసాయ అధికారులు, సంబంధిత శాఖాధికారులతో ఎరువుల సరఫరా, ఈ–పంట రికార్డింగ్, రైతుల రిజిస్ట్రేషన్, కౌలు రైతులకు సీసీయస్ కార్డుల జారీ, ప్రాజెక్టులకు భూముల కేటాయింపు తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డీఆర్ఓ రాము నాయక్ తదితర అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా ఎరువుల పంపిణీ సక్రమంగా జరగకపోవడంపై పత్రికల్లో ప్రతికూల వార్తలు వస్తున్న నేపథ్యంలో అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తగిన శిక్షణ ఇచ్చి రైతులకు సరైన రీతిలో ఎరువులు పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.41 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా, ఇప్పటివరకు 3.86 లక్షల ఎకరాల పంటలు మాత్రమే నమోదు చేశారన్నారు. ఈనెలాఖరులోపు ఖరీఫ్ పంటల బుకింగ్ పూర్తిచేయాలని అన్ని మండలాల వ్యవసాయ సిబ్బందికి ఆదేశించారు. చాగలమర్రి, బనగానపల్లె, రుద్రవరం, గడివేముల మండలాల్లో అధిక మొత్తం పెండింగ్‌లో ఉన్న నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె స్పష్టం చేశారు. ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ విషయంలో ఇంకా 4,500 మంది రైతులు నమోదు కావాల్సి ఉందని, ప్రతి రైతు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు డివిజన్లలో వర్క్‌షాప్‌లు పూర్తయ్యాయని, మిగిలిన డివిజన్లలో కూడా తక్షణమే పూర్తి చేయాలన్నారు. జిల్లాలోని 30 వేల మంది కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 15,593 మందికి పంపిణీ చేశారన్నారు. మిగిలిన కార్డులను కూడా త్వరగా అందించాలని ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు.

సేవే లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇంద్రావతి

శిరివెళ్ల: విద్యార్థి దశ నుంచే సేవ చేయడం లక్ష్యంగా చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. బుధవారం యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ డేను ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 1969లో డాక్టర్ వీకేఆర్‌వీ రావు కేంద్ర విద్యాశాఖ మంత్రిగా పథకంను ప్రారంభించారన్నారు. ప్రతి ఏటా విద్యార్థులు గ్రామాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఉన్న రాజకీయ నాయకుల్లో చాలా మంది జాతీయ సేవా పథకంలో ఉన్న వారేనన్నారు. కళాశాలకు కొత్తగా ఏసీసీ యూనిట్ మంజూరైందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

నంద్యాల(అర్బన్): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గురువారంరోజు స్వచ్చతా హీ సేవా, ఏక్ దిన్ , ఏక్ గంటా, ఏక్ సాథ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో జరిగే కార్యక్రమానికి గ్రామ సచివాలయ సిబ్బంది, ఎస్ హెచ్‌జీ గ్రూపు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరవుతారన్నారు. ప్రత్యేక అధికారులు పాల్గొనే ఈ కార్యక్రమానికి అందరూ హాజరవ్వాలన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



శిక్షణ ముగించుకున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): 26 జిల్లాల అంతర్రాష్ట్ర కబడ్డీ పోటీల్లో భాగంగా పాణ్యం, గడివేములలో నిర్వహించిన కబడ్డీ శిక్షణ కార్యక్రమం ముగిసింది. ఈనేపథ్యంలో బుధవారం క్రీడాకారులకు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేశవ మూర్తి, కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రూ. 19 వేలు విలువజేసే క్రీడాదుస్తులను పంపిణీ చేసినట్లు నంద్యాల జిల్లా కబడ్డీ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చింతల మోహన్‌రావు, సుబ్రమణ్యం తెలిపారు. శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులందరికి పాణ్యం విజయానికేతన్ పాఠశాల చైర్మెన్ విజయకుమార్‌రెడ్డి, గడివేముల పూర్వ కబడ్డీ క్రీడాకారులు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు శేషఫణి, సుబ్బయ్య, శ్రీనివాసరెడ్డి, బాషా, ఫిజికల్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, రమణ, రేవతి, రామేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బాల్‌బాడ్మింటన్‌కు క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని బాల్‌బాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ షేక్షావలి రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 28 నుంచి 30 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్‌బాడ్మింటన్ పోటీల్లో నంద్యాల జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సీనియర్ జాతీయ స్థాయి పోటీలకు దేవానంద్, శుభాష్, సబ్ జూనియర్ విభాగంలో ధర్మతేజ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 26 నుంచి 30 వరకు తమిళనాడు రాష్ట్రంలోని డిండిగల్‌లో జరిగే జాతీయ స్థాయి క్రీడల్లో వారు పాల్గొంటున్నట్లు తెలిపారు.

వన్య ప్రాణులకు హాని తలపెట్టొద్దు



రుద్రవరంలో సిబ్బందికి సూచనలు ఇస్తున్న రేంజర్

రుద్రవరం: రుద్రవరం రేంజ్‌లో ఎవరైనా వన్య ప్రాణులకు హాని తలపెట్టినా, విలువైన వృక్ష సంపదను అక్రమంగా తరలించినా అటవీ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని రుద్రవరం రేంజ్ అధికారి ముర్తుజావలి అన్నారు. స్థానిక అటవీ కార్యాలయంలో బుధవారం ఆయన రేంజ్ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్యప్రాణులను వేటాడినా, ఉచ్చులు, వలలు వంటివి ఏర్పాటు చేసినా చర్యలు తీవ్రంగా ఉంటాయని రైతులు, ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎఫ్ఎస్ఓలు మక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, మాబుఖాన్, ఎఫ్‌బీఓలు జేమ్స్‌పాల్, నరసింహారెడ్డి, నాగుశేనయ్య, సురేంద్ర గౌడ్, సుభాస్, మదనగోపాల్ ఉన్నారు.



ఉయ్యాలవాడలో చెరువును తలపిస్తున్న పంటపొలాలు



పడిగెపాడు గ్రామ సమీపంలో మిరపలో వర్షపు నీరు నిలిచి వున్న దృశ్యం

వదలని వర్షం

ఉయ్యాలవాడ: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వరుసగా వారం రోజుల నుంచి వర్షం కురుస్తూ ఉంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చల్లగా ఉండి రాత్రి పూట వర్షం దంచికొడుతోంది. మంగళవారం రాత్రి మండలంలో కురిసిన వానకు పంటపొలాలు జలమయమయ్యాయి. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన మొక్కజొన్న, మినుము, పత్తి, మిరప, తదితర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వరుసగా వానలు కురుస్తుండటంతో పొలాల్లో తడి ఆరక పైర్లు కుళ్లిపోతున్నాయి. మరోవైపు వారం రోజుల్లో ప్రారంభం కానున్న రబీ సీజన్‌కు పంటపొలాలను సిద్ధం చేసుకోలేని పరిస్థితి నెలకొంది.